ప్రజాశక్తి
మంగళవారం 18 జూన్ 2024
5
శ్రీకాకుళం



26న పోస్టల్ అదాలత్

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించేందుకు వీలుగా ఈనెల 26న పోస్టల్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ వండాన హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రెల్లవీధిలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న సూపరింటెండెంట్ కార్యాలయంలో తపాల అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తపాల సేవలకు సంబంధించిన వ్యక్తిగత ఫిర్యాదులను ఈ అదాలత్‌లో చర్చించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదు చేయదలచిన వారు వి.హరిబాబు, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు, శ్రీకాకుళం పోస్టల్ డివిజన్, శ్రీకాకుళం 532001 చిరునామాకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు పంపాలని సూచించారు. నేరుగా కూడా హాజరై ఫిర్యాదులు వ్యక్తిగతంగా అందజేయవచ్చని తెలిపారు.



శ్రీకాకుళం జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ఘనంగా బక్రీద్ వేడుకలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా బక్రీద్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులు మసీదులు, దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు అలయ్ బలయ్‌తో శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇళ్లల్లో ఖుర్బానీ నిర్వహించి సంబరంగా పండగను నిర్వహించుకున్నారు. శ్రీకాకుళం నగరంలోని జామియా మసీదులో సామూహిక ప్రార్థనలో పెద్దసంఖ్యలో ముస్లిములు పాల్గొన్నారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ జామియా మసీదులో ప్రార్థనలు చేశారు. మసీదు కమిటీ సభ్యులు మహిబుల్లా ఖాన్, జియావుల్ రహ్మాన్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమానత్వం, సేవా దృక్పథం, త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ అని అన్నారు. మనిషి సేవా నిరతి, క్షమాగుణం అలవర్చుకోవాలన్నదే ఈ పండగ ముఖ్య ఉద్దేశమన్నారు. జామియా మసీదుకు 400 ఏళ్ల చరిత్ర ఉందని, ఈ ప్రాచీన కట్టడాన్ని అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇస్లాం ధర్మం ఐదు మౌలిక సూత్రాలపై ఆధారపడి ఉందని వాటిలో ఏ ఒక్క సూత్రాన్ని విస్మరించినా విశ్వాసం పరిపూర్ణం కాదన్నారు. ముస్లిముల రెండో పెద్ద పండగగా నిర్వహించుకునే బక్రీద్.. త్యాగాల సందేశాన్ని తెలియజేస్తుందన్నారు.



ప్రార్థన చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

హుదూద్ ఇళ్లకు మోక్షం లభించేనా?

లబ్ధిదారుల ఎదురుచూపులు

(6లో)

మంత్రులకు అఖండ స్వాగతం

- పైడిభీమవరం నుంచి శ్రీకాకుళం వరకు కోలాహలంగా ర్యాలీ
- పెద్దఎత్తున తరలివచ్చిన కూటమి నాయకులు, అభిమానులు
- పలుచోట్ల గజమాలలు, బాణసంచా కాల్చిన శ్రేణులు
- శ్రీకాకుళం నగరంలో పౌర సన్మానం
- జిల్లా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం : మంత్రులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారి జిల్లాకు సోమవారం వచ్చిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడుకు టిడిపి శ్రేణులు, అభిమానులు అఖండ స్వాగతం పలికారు. జిల్లా సరిహద్దు పైడిభీమవరం నుంచి స్వగ్రామం కోటబొమ్మాళి మండలంఓని నిమ్మాడ వరకు వందలాది వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. పలుచోట్ల గజమాలలు వేసి తమ నేతలపై అభిమానం చాటుకున్నారు. పలు కూడళ్లలో పూల వర్షం కురిపించారు. బాణసంచా కాల్చి ఆనందంతో నృత్యాలు చేశారు. తప్పెటగుళ్లు, ఇతర రూపాల్లో కోలాహలంగా ర్యాలీ సాగింది. ఓపెన్ టాప్ జీప్‌లో ఇరువురు మంత్రులతో పాటు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లాకు చెందిన ఇతర ఎమ్మెల్యేలు.. కార్యకర్తలకు, ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం శ్రీకాకుళం నగరంలో ఇద్దరు మంత్రులకూ పౌర సన్మానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులనుద్దేశించి కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఎంపీగా ఉంటూ 2014 నుంచి ఇప్పటివరకు జిల్లాకు సంబంధించిన అనేక సమస్యలను కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. ప్రస్తుతం కేంద్రమంత్రిగా ఉండటంతో అన్ని శాఖల కేంద్రమంత్రులతో మాట్లాడి రాష్ట్రం, జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకొస్తానని చెప్పారు. విజయనగరం జిల్లాలోని భోగాపురం ఎయిర్‌పోర్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి మూడు జిల్లాలకు అభివృద్ధి కేంద్రంగా మారుస్తాని మాట ఇచ్చారు. సాగునీటి ప్రాజెక్టులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా టీమ్‌తో కలిసి జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం చాలా రాక్షసంగా వ్యవహరించిందని, తప్పులు చేసే వారిని ఎవరూ కాపాడలేరన్నారు. కక్షపూరిత రాజకీయాల కంటే అభివృద్ధి పైనే ప్రధానంగా దృష్టిసారిస్తామన్నారు.

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెనాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ పరిపాలన ఎలా సాగిందో చూశామని.. ఎన్నో కష్టాలు, ఇబ్బందులు పడ్డామని చెప్పారు. రాష్ట్రంలో తాను, వైసిపి తప్ప ఎవరూ ఉండకూడదనట్లుగా జగన్మోహన్‌రెడ్డి వ్యవహరించారని విమర్శించారు. ఎప్పుడూ ఇన్ని బాధలు పడలేదని, పార్టీ ఉంటుందా అనే సందేహం కూడా వచ్చిందన్నారు. మనది డబుల్ ఇంజిన్ సర్కార్ అని కేంద్రం, మోడీ సహకారంతో అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. వెనుకబడిన జిల్లాగా పేరొందిన శ్రీకాకుళం ప్రాంతానికి 90 శాతం సబ్సిడీలు, ఉద్యాన పంటలు, పశుసంపద అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతానని హామీనిచ్చారు. జిల్లాకు కొత్త పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. ప్రతి మండలంలో 400 ఎకరాలను సేకరించి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఉన్న పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను రెండు, మూడేళ్లలో పూర్తి చేసి సాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. మత్యకారులకు జెట్టీలతో పాటు కోల్డ్ స్టోరేజీలను నిర్మించి వలసలు లేకుండా చూస్తామన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తామని చెప్పారు. కోడి రామ్మూర్తి స్టేడియం పూర్తి చేస్తామన్నారు. మంత్రిగా ధర్మాన ప్రసాదరావు, శాసనసభ స్పీకర్‌గా తమ్మినేని సీతారాం పనిచేసినా శ్రీకాకుళం, ఆమదాలవలస రోడ్డును పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. ఈ రోడ్డు పనులు ఈనెల 19న ఉదయం పది గంటల కల్లా కాంట్రాక్టర్ మొదలుపెడతారని చెప్పారు.

శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కూటమికి ఘన విజయం అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.

రామ్మోహన్ నాయుడు అనే నేను..

ఢిల్లీలో ఎంపీగా తాను చేసిన ప్రమాణ స్వీకారం సగమేనని, జిల్లా ప్రజల ముందు చేస్తేనే పరిపూర్ణమవుతుందంటూ కేంద్ర మంత్రి... రామ్మోహన్‌నాయుడు అనే నేను అంటూ ప్రారంభించి మరోసారి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, ఎన్.ఈశ్వరరావు, మామిడి గోవిందరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



భారీ గజమాలతో సత్కారం



ర్యాలీగా వస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



నినాదాలు చేస్తున్న కళాసీలు

సమగ్ర చట్టం అమలు చేయాలి

పోలాకి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళాసీలకు సమగ్ర చట్టం అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కళాసీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిన్నారావు, కె.సూరయ్య డిమాండ్ చేశారు. మండలంలోని పిన్నింటిపేటలో కళాసీ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కళాసీలు తమ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం పిన్నింటపేట, బెలమర కళాసీ కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బి.రామారావు, ఉపాధ్యక్షులుగా కొయ్యాన మల్లేష్, కోశాధికారిగా కలగ సింహాచలం, సభ్యులుగా కె.భైరాగి, వీరన్న, మల్లేష్, వీరస్వామి, పోతయ్య, రాంబాబును ఎన్నుకున్నారు.

నేలవాలిన అరటి, బొప్పాయి పంటలు

- ఈదురుగాలులతో వర్షం
- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - లావేరు

మండలంలో సోమవారం ఉదయాన్న ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు బొప్పాయి, అరటి పంటలు నేలవాలాయి. లావేరు, లావేటిపాలెం, జిజివలస, కేశవరాయపురం, సూర్యనారాయణపురం గ్రామల్లో సుమారు వందెకరాల్లో ఎకరాల్లో అరటి, బొప్పాయి పంటలు గాలులకు నేలకొరిగాయి. పంట పూర్తిగా పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కోసం అప్పు చేసి పెట్టుబడులు పెట్టామని వాపోతున్నారు. ప్రభుత్వం పంట నష్టపరిమారం అందజేసి ఆదుకోవాలని కోరు తున్నారు. మరోవైపు తామాడ, సూర్య నారాయణ పురం, పట్టణాయుని పేటలో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు విరిగి రహదారికి అడ్డంగా పడ్డాయి. పలుచోట్ల చెట్లు నేలకూలాయి. రహదారిపై అడ్డంగా పడిన చెట్లు, విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. లైన్ల పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



కొత్తరౌతుపేట వద్ద రహదారికి అడ్డంగా పడిన చెట్టు



తామాడలో నేలవాలిన అరటి పంటలు

'నీట్'పై సమగ్ర విచారణ చేయాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నీట్ పరీక్షపై వస్తున్న విమర్శల నేపథ్యంలో సమగ్ర విచారణ చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నీట్ యుజి-2024 ఫలితాల్లో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, వారందరికీ 720/720 మార్కులు రావడం ఎన్నో అనుమానాలకు తావిస్తున్నాయని తెలిపారు. అదే కేంద్రంలో పరీక్ష రాసిన విద్యార్థి జాన్వీ 179 ప్రశ్నలను అటెమ్ చేసిందని అందులో 163 కరెక్ట్ కాగా, ఆమెకు 636 మార్కులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఆ విద్యార్థినికి 720/720 వచ్చాయని తెలిపారు. ఎంతోమంది విద్యార్థులకు సాధ్యం కాని విధంగా 718, 719 మార్కులు వచ్చాయని తెలిపారు. నీట్ పరీక్ష వివాదంపై ఎన్‌టిఎ వివరణ ఇస్తూ, పరీక్షలో సమయం కోల్పోయినట్లు నివేదించిన అభ్యర్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడం వల్ల 718, 719 మార్కులు వచ్చాయని, ఒక ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఉండడం వల్ల రెండు ఆప్షన్లు సరైనవిగా ప్రకటించి 44 మంది అభ్యర్థుల మార్కులు 715 నుంచి 720కి పెరిగాయని వివరించిందని తెలిపారు. కొంతమంది విద్యార్థులకు వందకు పైగా గ్రేస్ మార్కులు కలిపారని పేర్కొన్నారు. ఫలితాలను మొదట ఈనెల 14 తేదీన విడుదల చేస్తామని ప్రకటించి, ఈనెల నాలుగో తేదీ ఎన్నికల ఫలితాల రోజున విడుదల చేయడంపై సందేహాలు తలెత్తుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను తీసుకొచ్చి విద్య ప్రయివేటీకరణ చేస్తోందని విమర్శించారు. దేశం మొత్తం ఒకే పరీక్ష ఉండాలని విద్యార్థులపై ఒత్తిడిని పెంచిందని తెలిపారు. ఇది పూర్తిగా రాష్ట్రాల హక్కులను కాలరాయడమే అవుతుందని పేర్కొన్నారు. నేషనల్ టెస్ట్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షలన్నింటిపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణలో విఫలమైనందుకు గానూ ఈ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



జీడి రైతు కుదేలు



జీడిపిక్కలను తూకం వేస్తున్న రైతులు

జీడి రైతులకు కష్టాలు తప్పడం లేదు. దిగుబడి వస్తే ధర లేకపోవడం, ధర అంతో ఇంతో పెరిగిదంటే దిగుబడులు తగ్గిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది జీడి పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోగా, గతేడాది కన్నా జీడిపిక్కల బస్తా ధర కొంత పెరిగింది. పెరిగిన ధర కూడా పెట్టుబడి ఖర్చులకు రాని దయనీయ పరిస్థితి. మరోవైపు మద్దతు ధర మాత్రం కానరావడం లేదు. ఏటా జీడిపిక్కలు దిగుబడి సమయానికి దళారులు, వ్యాపారులు ఒక్కటై ధరను దించేస్తుండడంతో, రైతులకు చివరికి కష్టమే మిగులుతోంది. అధికారంలోకొస్తే జీడిపిక్కలకు మద్దతు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని టిడిపి హామీనివ్వడం, ఆ ప్రభుత్వమే అధికారంలోకి రావడంతో ప్రభుత్వ నిర్ణయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

- గణనీయంగా తగ్గిన దిగుబడి
- పిక్కలకు దక్కని మద్దతు ధర
- ఆర్‌బికెల్లో కొనుగోలు చేయాలని డిమాండ్
- ప్రభుత్వ నిర్ణయం కోసం రైతుల ఎదురుచూపులు

ప్రజాశక్తి - పలాస

జిల్లావ్యాప్తంగా 51 వేల ఎకరాలకు పైగా జీడి పంట సాగవుతోంది. ఉద్దానంలోని వజ్రపుకొత్తూరు, పలాస, మందస, కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో సుమారు 46,744 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ పంటపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదు లక్షల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. ఇక్కడి నుంచి ఏటా సుమారు ఆరు వేల మెట్రిక్ టన్నుల జీడిపిక్కలు దిగుబడులు సాధిస్తుండగా, జీడిపప్పు ఎగుమతులతో రూ.వందల కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి.

గణనీయంగా తగ్గిన దిగుబడి

తిత్లీ తుపాను నుంచి జీడి రైతులకు నష్టాలు తప్పడం లేదు. తిత్లీ తుపానులో వేల ఎకరాల్లో జీడి తోటలు నాశనం కాగా, అప్పట్నుంచి జీడి దిగుబడి కూడా తగ్గిపోయింది. గతేడాది ఎకరాకు నాలుగు నుంచి ఆరు ఆరు బస్తాల దిగుబడి రాగా, ఈ ఏడాది ఈ ఏడాది మెట్ట ప్రాంతాల్లో బస్తా, ఇసుక నేలల్లో రెండు బస్తాల దిగుబడి వచ్చిందని రైతులు చెప్తున్నారు. గతేడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకు వర్షాలు కురవకపోవడం, మరోవైపు అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం వల్లే జీడి దిగుబడి తగ్గడానికి కారణాలని ఉద్యానశాఖ అధికారులు చెప్తున్నారు. ఈ ఏడాది ఎకరాకు సుమారు రూ.30 వేల వరకు పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని మద్దతు ధర

ఉద్దానంలో పండిన జీడి పిక్కలకు గిరాకీ ఎక్కువ. ఇక్కడ పండిన పిక్కలు రుచిగా ఉంటాయి. దీంతో ఇక్కడి పిక్కలకు విదేశాల నుంచి దిగుమతి చేసిన పిక్కలను వ్యాపారులు కలుపుతుంటారు. గతేడాది 80 కేజీల జీడిపిక్కల బస్తా ధర రూ.ఏడు వేలకు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది బస్తా రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు పెరిగినా దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. వైసిపి ప్రభుత్వంలో జీడి రైతులకు మద్దతు ధర విషయంలో తీవ్ర అన్యాయం జరిగింది. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు జీడి రైతులను ఆదుకుంటాం, ప్రభుత్వం నుంచి రూ.వెయ్యి చెల్లిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయారు. గతేడాదితో పోల్చుకుంటే దిగుబడి తగ్గడంతో ఈ ఏడాది ధర కొంత పెరిగినా ఇది పెట్టుబడి ఖర్చులకూ సరిపోవని రైతులు వాపోతున్నారు.

హామీ నెరవేరేనా..?

టిడిపి అధికారంలోకి వచ్చాక జీడికి మద్దతు ధర కల్పిస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీనిచ్చారు. ఆ హామీల అమలు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరరడంతో 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర అందుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు గ్రామాల్లో జీడిపిక్కల కొనుగోళ్ల ఊసే లేదు. ప్రభుత్వ నిర్ణయం కోసం చూస్తూ ఇళ్లల్లోనే పిక్కలను నిల్వ చేస్తున్నారు. సొమ్ము అత్యవసరమైతే తప్పని పరిస్థితుల్లో వ్యాపారులు, దళారులు చెప్పిన ధరకే రైతులు విక్రయిస్తున్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పెట్టిన పెట్టుబడి కూడా రాదు



ఈ ఏడాది దిగుబడి బాగా తగ్గిపోయింది. పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. పంటకు రూ.30 వేలు పెట్టుబడి పెడితే, రూ.10 వేలు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. వరి పంటలా జీడి పంటను కరువు పంటగా ప్రకటించాలి. ప్రభుత్వం చొరవ చూపి జీడి రైతులను ఆదుకోవాలి.

- కుత్తుం వినోద్ కుమార్, జీడి రైతు

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



జీడి పిక్కల కొనుగోలు సీజన్ మొదలైంది. పంట చేతికొచ్చి ఇంట్లో పిక్కలు నిల్వ ఉన్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం జీడి రైతులు ఎదురుచూస్తున్నారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ఇవ్వాలి. సమయం మించిపోతుండడంతో రైతుభరోసా కేంద్రాల ద్వారా త్వరితగతిన ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

- తెప్పల అజయ్ కుమార్, జిల్లా కన్వీనర్, జీడి రైతుల సంఘం

హుదూద్ ఇళ్లకు మోక్షం లభించేనా?

- అర్హుల జాబితా ప్రశ్నార్థకం
- లబ్ధిదారుల గుండెల్లో గుబులు

ప్రజాశక్తి- టెక్కలి

నియోజకవర్గ కేంద్రమైన టెక్కలి పట్టణంలోని పాత ఆస్పత్రి భవనాల ఎదురుగా నిర్మించిన హుదూద్ ఇళ్ల పంపిణీ వ్యవహారంపై అప్పటి, ప్రస్తుత మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టి సారించారు. గత టిడిపి హయాంలో రూ.13 కోట్ల వ్యయంతో హుదూద్ నిధులతో 190 ఇళ్లు నిర్మించారు. నిర్మాణాలు జరిగిన వెంటనే టెక్కలి పట్టణంలో రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోయిన బాధితులు, పట్టణంలో పేదలకు పంచేందుకు అప్పట్లోనే జాబితాను రూపొందించారు. అయితే పంపిణీ సమయంలో 2019 ఎన్నికల కోడ్ అమలు కావడంతో ఇళ్ల పంపిణీ కార్యక్రమం నిలిచిపోయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వీటిపై కనీసం దృష్టి సారించలేదు. నిర్మాణం జరిగిన ఇళ్లలో అసాంఘీక కార్యకలాపాలు జోరందుకున్నాయి. ఇదే మార్గంలో అప్పటి పాలకులు, డివిజన్‌స్థాయి అధికారులు రోజూ తిరిగినా వాటిని నిలువరించలేకపోయారు. సరికదా రూపొందించిన జాబితా ప్రకారం పంపిణీకీ సిద్ధమవ్వలేదు. మూడేళ్ల తర్వాత అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం దృష్టి సారించి పాత జాబితా కాదని, మరో జాబితా రూపొందించారు. 90 ఇళ్లను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పంపిణీ చేశారు. హుదూద్ ఇళ్ల పంపిణీలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని ఎమ్మెల్యే హోదాలో కింజరాపు అచ్చెన్నాయుడు అప్పట్లో సబ్ కలెక్టర్‌కు లేఖ రాశారు. దీంతో రెండో జాబితా ప్రకారం ఇళ్ల పంపిణీ నిలిచిపోయింది.


హుదూద్ ఇళ్లు

అయితే మొదటి జాబితాలో ఇళ్లు పొందిన వారంతా నిజమైన అర్హులు కారని, వైసిపి ద్వితీయ శ్రేణి నాయకులు ఇళ్లు అమ్ముకున్నారనే వాదన వినిపించింది. ఇప్పుడు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టి సారిస్తే ఇప్పటివరకు ఇళ్లు పొందిన వారి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకం. కాగా, వైసిపి నాయకులకు డబ్బులు ఇచ్చి ఇళ్లు కొనుగోళ్లు చేసుకున్న వారి పరిస్థితి అయోమయంగా మారుతుంది. హుదూద్ ఇళ్ల పంపిణీపై కింజరాపు దృష్టి సారించి అప్పట్లో రుపొందించిన జాబితా ప్రకారం అందజేస్తారా? లేక ఇప్పుడు ఉన్న వారికిని కలుపుకొని ఇళ్లు మంజూరు చేస్తారా? అనేది ప్రశ్నార్థకం. గతంలో ఉన్న జాబితా ప్రకారం ఇళ్లు మంజూరు చేయాలని కొందరు లబ్ధిదారులు కోరుతున్నారు. ఇప్ప టికే ఇళ్లు అందుకున్న తమల్ని కూడా గుర్తించాలని ప్రస్తుత లబ్ధిదారులు కోరుతున్నారు. ఇటువంటి గందరగోళ పరిస్థితిపై మంత్రి అచ్చెన్నాయుడు ఏ రీతిన స్పందిస్తారో వేచి చూడాలి.


మాట్లాడుతున్న మహాలక్ష్మి

రాజకీయ కక్షసాధింపులు ఆపాలి

ఎండిఎం జిల్లా గౌరవాధ్యక్షులు మహాలక్ష్మి

ప్రజాశక్తి- మందస

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులపై రాజకీయ కక్ష సాధింపుతో తొలగింపులు జరుపుతున్నారని, అటువంటి తొలగింపులను ఆపాలని మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మందసలోని మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల యూనియన్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. 23 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంట కార్మికులను గుర్తించకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని అన్నారు. కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలన్నారు. ప్రతినెలా 5లోగా వేతనాలు, బిల్లులు చెల్లించాలన్నారు. వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కారం కోరుతూ ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో మండల యూనియన్ నాయకులు జి.ప్రభావతి, మరియమ్మ, సునీత, కళ్యాణి, కౌసల్య, తులసి, సుందరి, ప్రవీణ పాల్గొన్నారు.


నియామకపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

అవకాశాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

డిగ్రీ పూర్తయిన వెంటనే అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే మంచి భవిష్యత్‌కు పునాది అవుతుందని గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు అన్నారు. కళాశాలలో సోమవారం జాబ్‌మేళా ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పిజి తరువాత ఉద్యోగం ప్రయత్నం చేయడం కన్నా, డిగ్రీ పూర్తయినే వెంటనే జాబ్‌మేళాల, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పాల్గొని ఉద్యోగంతో పాటు వృత్తి నైపుణ్యం పెంచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. జాబ్‌మేళాలో ఆరు ప్రముఖ సంస్థలు వివిధ హోదాల్లో ఉద్యోగాల భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా వంద మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 60 మంది ఎంపికయ్యారన్నారు. వారికి ఆయా కంపెనీలు నియామకపు పత్రాలు అందజేసినట్టు వివరించారు. కార్యక్రమంలో వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు, సిఆర్‌టి, ట్రైనర్ రవి, ఐక్యూఎసి డాక్టర్ మార్తండ కృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారి కె.బాలసుందర్, వంగ మహేష్, రాజకుమార్, బాలాజీ, మహేష్, ధన్వంతరీ, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు స్వాగతం

రణస్థలం రూరల్ : జిల్లా ముఖద్వారం పైడిభీమవరం వద్ద కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులకు స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) కూటమి నాయకులు, అభిమానులతో కలిసి స్వాగతం పలికారు. కోష్ట నుంచి రణస్థలం వరకు ర్యాలీ నిర్వహించి కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రనాయుడు విగహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, టిడిపి పూర్వ అధ్యక్షులు వెలిచేటి జోగిరాజుమౌళి,పిసిని జగన్నాథం నాయుడు, శ్రీనివాసరావు, గోవిందరెడ్డి, డిజిఎం ఆనందరావు, లక్ష్మణరావు, ముప్పిడి సురేష్, ఇజ్జడ శ్రీనివాసరావు, లెంక శ్యాం, భాను పాల్గొన్నారు.

పాతపట్నం: పదవీ బాధ్యతలు చేపట్టి తొలిసారిగా జిల్లాకు వచ్చిన కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులకు విశాఖ విమానాశ్రమయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అలాగే హోంమంత్రి వంగలపూడి అనిత కూడా విశాఖ విమానాశ్రయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ముస్లిములకు శుభాకాంక్షలు

హజ్రత్ ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరించుకుంటూ బక్రీద్ పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్న ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని మతాలూ సమానమేనని, అన్ని మతాల సారాంశమూ మానవత్వమేనని అన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యాన కేంద్ర, రాష్ట్ర మంత్రులకు ఘన స్వాగతం పలికేందుకు విశాఖపట్నం విమానాశ్రయానికి వెళ్లారు.

కొత్తూరు : కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులు పదవీ బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా సోమవారం జిల్లాకు వచ్చారు. వీరికి స్వాగతం పలికేందుకు మండలంలోని వివిధ పంచాయతీకి చెందిన టిడిపి నాయకులు స్వాగతం పలికేందుకు విశాఖపట్నం విమానాశ్రయానికి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో అగతముడి అరుణ్‌కుమార్, లోతుగెడ్డ భగవాన్ దాసునాయుడు, చొడవరపు జోగినాయుడు, రాము, లోకేష్, వెంకటరమణ, కోటి, టి.తిరుపతిరావు, పి.అమర్, ఎల్.జనార్ధన్, ఎం.కృష్ణ, జదీష్, శ్రీను, ఉపేంద్ర ఉన్నారు.

లావేరు : కేంద్ర, రాష్ట్ర మంత్రులను మండలంలోని సుభద్రపురం కూడలిలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ముప్పిడి సురేష్ ఆధ్వర్యాన ఘనస్వాగతం పలికారు. మంత్రుల వెంట చైతన్యరథంపై ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులు ఉన్నారు. టిడిపి మహిళ రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుజాత ఆధ్వర్యాన మహిళలు నాయకులకు పూలమాలలుతో ఘనంగా సన్మానించారు దారిపొడవునా పులా వర్షం కురిపించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, పి.మధుబాబు, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, ముప్పిడి మురళి, కూటమి నాయకులు పాల్గొన్నారు.


రణస్థలం రూరల్ : ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఈశ్వరరావు


పాతపట్నం : పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంజిఆర్


కొత్తూరు : తరలివెళ్తున్న టిడిపి నాయకులు


పలాస : చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. పలాస మండలంలో కారు, బైకు ఢీకొని ఇద్దరు, నందిగాం మండలంలోని బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో మరో ఇద్దరు గాయపడ్డారు.

పలాస : స్థానిక జూనియర్ కళాశాల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కారును, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఒడిశా రాష్ట్రం రామగిరికి చెందిన సవర జోగారావు, సవర సంతోష్‌లు గాయపడ్డారు. గొప్పిలి నుంచి ద్విచక్రవాహనంపై వీరు వస్తుండగా, ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదం ధాటికి కారు నుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం జిల్లా సర్వజనాసత్రికి రిఫర్ చేశారు. ఎస్ఐ పారినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నందిగాం : మండలంలోని పాలవలస కూడలి వద్ద జాతీయ రహదారి 16పై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పలాస మండలం బ్రాహ్మణతర్లాకు చెందిన నర్సిపురం కృష్ణారావు, పాపమ్ములు ద్విచక్ర వాహనంపై టెక్కలి వైపు వస్తున్నారు. వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే స్థానికులు 108లో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సి రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం షాపులో చోరీ

టెక్కలి రూరల్ : టెక్కలి కచేరివీధిలోని రాజరాజేశ్వరి జ్యులరీ షాపులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కారులో వచ్చిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు షాపులో పనిచేస్తున్న యువకుడిని బంగారం చైన్లు చూపించమని అడిగారు. చైన్లు చూపిస్తున్న క్రమంలో సుమారు నాలుగు తులాలు బంగారం చైన్లు లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితుడి టెక్కలి పోలీసులను ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జేబుదొంగల హల్‌చల్

ప్రజాశక్తి- లావేరు

కేంద్ర పౌర విమానాయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పదవీ బాధ్యతలు స్వీకరణ అనంతరం సోమవారం తొలిసారిగా జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని సుభద్రపురం కూడలి వద్ద కూటమి నాయకులు భారీగా తరలివచ్చారు. ఇదే అదునుగా జేబుదొంగలు చేతివాటం ప్రదర్శించారు. పాతకుంకాంకు ఎస్.వెంకటరమణ జేబులో రూ.50 వేలు, బెజ్జిపురానికి చెందిన వడ్డిపల్లి శ్రీను జేబులో రూ.50 వేలు, బొంతుపేటకు చెందిన వాళ్లే జగదీష్ జేబులో రూ.25 వేలు, ఇంకా మరో నలుగురు నుంచి రూ.80 వేలు, మొత్తంగా రూ.2 లక్షలకు పైగా దొంగలు కొట్టేశారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుక్కల దాడిలో బాలికకు గాయాలు

ప్రజాశక్తి- పలాస


గాయపడిన మేఘన

పలాస సీతారామ్ నగర్ కాలనీలో కుక్కల దాడిలో అదే ప్రాంతానికి చెందిన పాతాల మేఘన అనే ఐదేళ్ల బాలిక తీవ్ర గాయాలకు గురైంది. ఆమెను సమీపంలో ఉన్న సిహెచ్‌కి తరలించి చికిత్స అందించారు. మేఘన తన ఇంటి నుంచి ఆటాడుకోవడానికి ఎదురింటికి వెళ్లే క్రమంలో వీధి కుక్కలు దాడి చేసి ఛాతీ, చేయి, ముఖంపై గాయపరిచాయి. స్థానికులు చూసి కుక్కలను తరమడంతో బాలిక చిన్నపాటి గాయాలతో బయటపడింది. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

బకాయిలు చెల్లించాలి

కొత్తూరు : ఉపాధి హామీ కూలీలకు కనీస కూలి చెల్లించాలని, అలాగే ఇప్పటి వరకు ఉన్న బకాయిలు తక్షణమే చెల్లించాలని చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కూలీలకు ఐదు నెలలుగా కూలి చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 200 రోజులు పనులు కల్పించాలన్నారు. అడిగిన ప్రతిఒక్కరూ పనులు కల్పించాలన్నారు.

ఆయన నేత్రాలు సజీవం


రాజు (ఫైల్)

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని పెద్దబరాటం వీధిలో నివాసం ఉంటున్న వైస్యరాజు వెంకట మణిక్యరాజు (75) సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు చీలుక లక్ష్మీకాంత్, శ్రీసుధ, నీల మాధవిలు తమ తండ్రి నేత్రాలను దానం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు రెడ్‌క్రాస్ నేత్రాలయాన్ని సంప్రదించడంతో నేత్ర సేకరణ విభాగం హుటాహుటిన చేరుకుని నేత్ర సేకరించారు. విశాఖపట్నం ఎల్‌వి ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి కార్నియాను పంపించారు.

తగ్గని ఎండలు

టెక్కలి : రాష్ట్రంలోకి ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించి ఎలోనిన్ ప్రభావం ముగిసినా... ఎండల తీవ్రత మాత్రం తగ్గలేదు. సోమవారం నాటి ఉష్ణోగ్రతలు వేసవి ఎండలను గుర్తుచేశాయి. ఉదయం నుంచి వేడిమి వాతావరణం పెరగడంతో ఉక్కపోతకు ప్రజానీకం గురయ్యారు. రుతుపవనాలు ప్రభావం వల్ల వర్షాలూ కురవకపోవడంతో భూతాపం తగ్గలేదు. దీంతో ప్రజానీకం వేడిమి వాతావరణంతో అల్లాడిపోయారు. మధ్యాహ్నం సమయంలో రోడ్లపై తిరిగేందుకు జనం భయాందోళనకు గురవుతున్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో జనసంచారం లేకపోవడంతో వివిధ రకాల దుకాణాలు, వ్యాపారాలు లేక బోసిపోయాయి. వర్షాలు పడి భూతాపం తగ్గుతుందని ఆశించే ప్రజానీకానికి ఊరట లభించడం లేదు. కాగా, వాతావరణం చల్లబడేంతగా వర్షాలు లేకపోవడంతో ప్రజలు నీటి కోసం ఆరాటపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఏదేమైనా ఎండల తీవ్రత ప్రజానీకానికి ఆందోళన కలిగిస్తుంది.

మాతృమూర్తులు స్ఫూర్తిప్రదాతలు


ప్రశంసాపత్రం అందజేస్తున్న అనిల్‌కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాతృ రుణం ఎప్పటికీ తీర్చు కోలేనిదని, అలాగే నేలతల్లి అమ్మతనాన్ని ఎల్లప్పుడూ గుర్తు చేస్తుందని జూనియర్ ఛాంబర్స్ జిల్లా అధ్యక్షులు కూన అనిల్ కుమార్ అన్నారు. సోమవారం నిర్వహించిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న అవసరాల రీత్యా మగవారికి తోడుగా మహిళలు సైతం ఉపాధి, ఉద్యోగాల్లో చేరి కుటుంబ బాధ్యతలను భూజాన వేసుకుంటున్నారని అన్నారు. జన్మ నిచ్చింది మొదలు తుది శ్వాస విడిచే వరకు తల్లి తమ బిడ్డల పట్ల ఔదార్యాన్ని, ఆప్యాయతను కలిగి ఉంటారన్నారు. నిర్విరామంగా పనిచేస్తున్న ప్రతి తల్లికీ పాదాభివందనమన్నారు. నగరంలో మేమున్నామంటూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న బయాలజీ ఉపాధ్యాయులు సౌజన్య, రౌతు సుప్రజ, గిరజాల మహాలక్ష్మి, జోగి భారతి, రవీంద్ర భారతిలో ఐదో తరగతి చదువుతున్న ఉర్లాం ట్వింకిల్‌లను అభినందించారు. కార్యక్రమంలో జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు జామి భీమశంకర్, వైస్ ప్రెసిడెంట్ ఉర్లాం శివతేజ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా రామ్మోహన్

పలాస : పలాస విద్యుత్ డివిజన్ ఎస్‌సి, ఎస్‌టి విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామ్మోహన్ (సోంపేట)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ తిరుపతిరావు (పలాస రూరల్), కోశాధికారిగా లేన్‌మెన్ టి.ఈశ్వరరావు (పలాస సిఫ్ట్), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లైన్‌మెన్ ప్రభాకరరావు (పలాస టౌన్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రీజనల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి రాజేశ్వరరావు ఆధ్వర్యాన ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి.




చిత్రపటాన్ని స్వీకరిస్తున్న అంబికాకృష్ణ

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సినీ నిర్మాత, మాజీ ఎమ్మెల్యే పివివిపి కృష్ణారావు (అంబికా కృష్ణ) కుటుంబ సమేతంగా సందర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అలాగే సికింద్రాబాద్ రైల్వే ఎజిఎం పి..డిమిశ్రా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించే పలు సేవల్లో పాల్గొన్న వారకి ఆలయ ఇఒ ఎస్.చంద్రశేఖర్ శేష వస్త్రాలను కప్పి చిత్రపటాలను అందజేశారు.

శంకర్ అభిమాని పాదయాత్ర

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అభిమానానికి హద్దులుండవు. తాము అభిమానించే హీరోలైనా, నాయకులైనా వారి కోసం ప్రాణాలకు తెగించే అభిమానులనూ చూసాం. అటువంటి కోవలోకే వస్తాడు దమ్మల వీధికి చెందిన యువకుడు పొన్నాడ ప్రసాద్. ఎన్నికల్లో తన అభిమాన నాయకుడు గొండు శంకర్ అత్యధిక మెజారిటీతో గెలిస్తే కాలినడకన సింహాచలంలోని నృసింహస్వామి ఆలయానికి వస్తానని మొక్కుకున్నాడు. ఆయన అనుకున్న విజయం శంకర్‌కు వరించడంతో మొక్కు తీర్చుకునేందుకు సోమవారం పాదయాత్ర మొదలు పెట్టాడు. ఈ సందర్భంగా శంకర్ ప్రసాద్‌ను కలుసుకుని అభినందించాడు.


ప్రసాద్‌ను సత్కరించిన ఎమ్మెల్యే శంకర్

ఝాన్సీలక్ష్మీబాయికి నివాళి

పాతపట్నం : స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో ప్రిన్సిపాల్ వి.అర్చన అధ్యక్షతన రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యాన ఝాన్సీ లక్ష్మీబాయి 166వ వర్ధంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ముందుగా ఝాన్సీ లక్ష్మీబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర ఝాన్సీలక్ష్మీబాయ్ పోషించిందని అన్నారు. ఉపాధ్యాయులు వై.సునీత, ఎస్.రాధ, బి.భవాని, వి.కుమారి పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాలల భవనాలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లోని వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలు మూసివేత దిశగా ప్రయాణిస్తూ పేదల విద్యావకాశాలను దెబ్బతీసే విధంగా ఉంది. వైసిపి ప్రభుత్వం నాడు-నేడు నిధులతో ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి, ఇంగ్లీష్ భాష విద్యా విధానం, జగనన్న గోరుముద్ద, అమ్మఒడి, ఇతర విద్యాసామగ్రి ఏర్పాటుతో గ్రామీణ విద్యార్థులను ఆకర్షించడంలో ఏమాత్రం సత్ఫలితాలు ఇవ్వలేదని పలువురు పేర్కొంటున్నారు. మండలంలోని దుబ్బులపేట, చిగురువలస కాలనీ, వ్యాసులపేట, మాలపేట, చిన్నమతలబుపేట, సూర్యనారాయణపురం, చిన్నవెంకటాపురం, చిన్నషళంత్రి, సుభద్రాపురం, ఎల్,కె.పల్లి, పాలవలస, తురకపేట, తురకపేట కాలనీ, ఎల్.పి.ఎం.అగ్రహారం, అలమాజీపేట గ్రామాలకు చెందిన 15 ప్రభుత్వ పాఠశాలల్లో కనీస విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో మూసివేశారు. సుభద్రాపురంలో శిథిల భవన కారణంగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. నూతన పాఠశాల భవనం నిర్మించినప్పటికీ దాన్ని ప్రారంభించకపోవడంతో విద్యార్థులెవరూ పాఠశాలకు వెళ్లకపోవడంతో ఈ పాఠశాల మూసి వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం మండలంలో 43 ప్రాథమిక పాఠశాలలో మూడు ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ఒకటి ఉన్నాయి. వీటిలో విద్యార్థుల సంఖ్య పరిశీలించగా, 2021-22 సంవత్సరానికి 3,140 మంది విద్యార్థులు ఉండగా, 2022-23కి గాను 2,645 మంది విద్యార్థులు, 2023-24లో 2,023 మంది విద్యార్థులు ఉండగా, అది ప్రస్తుత విద్యా సంవత్సరమైన 2024-25కు 1834 మంది విద్యార్థులు ఉన్నారని విద్యాశాఖ గణాంకాలు తెలుపుతున్నాయి. జగనన్న విద్యా పథకాలు అందించినట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతి సమావేశాల్లో ప్రకటించారు. మండలంలో గత నాలుగేళ్లగాప్రభుత్వ పాఠశాలలో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్యకు ఏమాత్రం పొంతన లేకపోవడం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏ స్థాయిలో అభివృద్ధి చెందుతుందో తేటతెల్లమయింది.


శిథిలావస్థకు చేరుకున్న బురిడివలస కాలనీ పాఠశాల

మండలంలో నాడు-నేడు ఫేజ్-1 ద్వారా పలు పాఠశాలలు అభివృద్ధి చేశారు. నాడు-నేడు ఫేజ్-2 అంటూ కొన్ని పాఠశాలలను విస్మరించారు. ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజలు ఇటీవల పలు సందర్భాల్లో అధికారులను, ప్రజాప్రతినిధులనూ ప్రశ్నించారు. ఈ ఏడాది మండలంలోని నూతనంగా ప్రారంభం కానున్న విద్యా సంవత్సరానికి బురిడివలస కాలనీ, రావివలస, అమృత లింగానగరం, బప్పడాం, వీరభద్రపురం గ్రామాల్లోని శిథిల పాఠశాల భవనాలు విద్యార్థులకు స్వాగతం పలకనున్నాయి. బురిటివలస కాలనీ, రావివలస పాఠశాల భవనాలు పూర్తి శిథిలావస్థకు చేరుకొని విద్యార్థులు ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ దినదిన గండంగా చదువులు సాగించాల్సి వస్తోంది.

విత్తనాల పంపిణీ

బూర్జ: మండలంలోని అల్లెన, గుత్తావల్లి రైతు భరోసా కేంద్రాల వద్ద సోమవారం రైతులకు రాయితీపై విత్తనాలను చేసినట్లు మండల ఎఒ వి.రాజేశ్వరరావు తెలిపారు. మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాలకు 346 క్వింటాల వరి, పచ్చి రొట్టె విత్తనాలు వచ్చాయని అన్నారు. ఇంకా అవసరమైన రైతులు తమకు కావలసిన వరి రకాలు రిజిస్టర్ చేయించుకుంటే వారికీ అందజేస్తామని వివరించారు. యూరియా, డిఎపి కూడా రైతు భరోసా కేంద్రాల వద్ద ముందస్తుగా నిల్వలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వావిలపల్లి సీతారాం బాబునాయుడు, అల్లెన సర్పంచ్ జడ్డు మహేశ్వరరావు, గుత్తావల్లి సర్పంచ్ ప్రతినిధి హనుమంతు గోవిందరాజు, పప్పల రామచంద్రరావు, విఎఎలు ప్రియాంక, కృష్ణారావు పాల్గొన్నారు.


విత్తనాలను పంపిణీ చేస్తున్న నాయకులు

వీల్‌చైర్ వితరణ

ఇచ్ఛాపురం : మండలంలోని పురుషోత్తపురంలో గాలి కేశవరావు ఓ ప్రమాదంలో తన రెండు కాళ్లను కోల్పోయాడు. దీంతో నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరంగా వీల్‌చైర్ అవసరమని తెలుసుకున్న సొండిపూడి స్వచ్ఛంద సంస్థ ఇంటికి వెళ్లి సోమవారం వీల్‌చైర్‌ను అందజేశారు. సహకరించిన మిత్రుడు నారాయణరావు, శిష్యులు చింతల లక్ష్మీనారాయణ, ఈశ్వరరావు, కాశీలకు కేశవరావు కృతజ్ఞతలు తెలిపారు.


వీల్‌చైర్‌ను అందజేస్తున్న సభ్యులు


పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి శ్రీను

ఈదుపురంలో పారిశుధ్య పనులు

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురం పంచాయతీలో అంటు వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కార్యదర్శి నీలపు శ్రీను అన్నారు. ఈ మేరకు గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. చెత్తా చెదారాలను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. మార్కెట్ వీధిలో చేపడుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

అరకొరగా కిట్లు పంపిణీ

పాఠశాలలు ప్రారంభమైనా అందని వైనం

ప్రజాశక్తి- బూర్జ

ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని, అన్ని రకాల వసతులు కల్పిస్తామని నాయకులు చేసిన ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి. ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

వైసిపి ప్రభుత్వం మారి టిడిపి అధికారంలోకి రావడంతో జగనన్న విద్యాకానుక పేరును అధికారులు స్టూడెంట్ కిట్లుగా మార్పు చేసి అందిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై ఏడు రోజులు గడుస్తుంది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో కిట్లు పాఠశాలలకు చేరుకోలేదు. పాఠ్యపుస్తకాలు మాత్రమే అరకొరగా వచ్చాయి. యూనిఫారాలు, బెల్టులు, బ్యాగులు డిక్షనరీలు ఇంతవరకు మండలంలోని పాఠశాలలకు చేరుకున్న పరిస్థితి కనిపించలేదు. ఈ నెల 12న పాఠశాల పున:ప్రారంభం కావాల్సి ఉండగా, అదే రోజు సిఎం చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం ఉండటంతో 13 నుంచి పాఠశాల తెచ్చారు. తెరిసిన రోజున స్టూడెంట్ కిట్లను పూర్తిస్థాయిలో పంపిణీ చేమయాల్సి ఉన్నా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంతో జాప్యం జరుగుతుంది. మండలంలో 63 పాఠశాలలు ఉన్నాయి ఈ పాఠశాలల్లో 3,420 మంది విద్యార్థులు చదువుతున్నారు స్టూడెంట్లు కిట్లలో నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బెల్టు, సాక్షులు, యూనిఫారాలు, బ్యాగ్‌లు ఇస్తున్నారు. యూనిఫారాలు కుట్టించుకునేందుకు కుట్టు కూలీ గతంలో ఇచ్చేవారు. వేసవి సెలవుల్లోనే ఈ కిట్లను పాఠశాల తెరిచే రోజున విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంది.


ఎంఆర్‌సి కార్యాలయం

మండలంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 63 పాఠశాలలకు సంబంధించి సుమారు 3,420 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ పాఠ్యపుస్తకాలు అవసరకాగా, ఇప్పటి వరకు అరకొరగానే ఎంఆర్‌సికి చేరాయి. 4,5,6 తరగతులకు సంబంధించి తెలుగు, మ్యాథ్స్ పుస్తకాలు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి మిగతా పాఠ్యపుస్తకాలు ఇంతవరకు చేరలేదు. ఈ విషయంపై ఎంఇఒ ధనుంజయను వివరణ కోరగా.. విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీకి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నోటు పుస్తకాలు, షూస్, యూనిఫారాలు, బ్యాగులు విద్యార్థులకు సరిపడా వచ్చాయన్నారు. కానీ, పాఠ్యపుస్తకాలు కొంతవరకు రాలేదని వివరించారు. పూర్తిస్థాయిలో రాగానే విద్యార్థులకు కిట్లు పంపిణీకి చర్యలు చేపడతామని తెలిపారు. వచ్చిన మేరకు మండలంలోని ఆయా పాఠశాలకు అందజేశామని అన్నారు.